ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025



6న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల ఆరో తేదీన జరగనున్నాయని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆరో తేదీ ఉదయం పది గంటలకు రెండో స్థాయీ సంఘ సమావేశం, 11 గంటలకు నాలుగు, మధ్యాహ్నం 12 గంటలకు ఏడు, ఒకటి స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఉదయం 10.30 గంటలకు మూడు, 11.30 గంటలకు ఐదు, మధ్యాహ్నం 12.30 గంటలకు ఆరో స్థాయీ సంఘ సమావేశం జరుగుతాయన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

పీఎంఏవై-జీ కింద మంజూరుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేటలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్

- సొంత స్థలం ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు
- గ్రామాల్లో యూనిట్‌కు రూ.1.59 లక్షలు, పట్టణాల్లో రూ.2.8 లక్షలు
- దరఖాస్తుకు రేపటితో ముగియనున్న గడువు
- గ్రామాల్లో కూడా యూనిట్ ధర రూ.2.8 లక్షలకు పెంచాలని పలువురి వినతి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ (పీఎంఏవై-జీ) కింద పక్కా ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఇంతవరకు సుమారు 16 వేల దరఖాస్తులు అందాయి. బుధవారంతో గడువు ముగియనున్నది.

ఇళ్లు లేని పేదలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించింది. జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు జిల్లాలో సొంత ఇల్లు లేని వారి వివరాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ జాబితాను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. పీఎంఏవైజీ 2.0 కింద పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. అర్హులైన వారు ఈ నెల 5వ తేదీలోగా సమీపంలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం గత నెలలో ప్రకటించింది. దరఖాస్తుదారులకు సొంత స్థలం ఉండాలి. దీనికి సంబంధించి డాక్యుమెంట్/డి.పట్టా/పొసెషన్ సర్టిఫికెట్లలో ఏదో ఒకటి తప్పని సరిగా వుండాలి. దీంతోపాటు బియ్యం కార్డు, కుల ధ్రువీకరణపత్రం, భార్యాభర్తలు ఆధార్ జెరాక్స్ కాపీలతో సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

రేపటితో ముగియనున్న గడువు

సొంత ఇంటి మంజూరుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 5వ తేదీ వరకే గడువు వుంది. పట్టణాల్లో యూనిట్ ధర (ఒక ఇల్లు) రూ.2.8 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.59 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 16,029 దరఖాస్తులు అందాయి. వీటిలో 464 దరఖాస్తులు పట్టణ, 15,506 దరఖాస్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చాయి. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి అత్యధికంగా 3,863 మంది, పెందుర్తి నియోజకవర్గం నుంచి తక్కువగా 301 దరఖాస్తులు అందాయి. అనకాపల్లి నుంచి 2,051, మాడుగుల నుంచి 3,258, నర్సీపట్నం నుంచి 1,306, ఎలమంచిలి నుంచి 2,273 దరఖాస్తులు వచ్చాయి. కాగా భవన నిర్మాణ సామగ్రి, కూలి రేట్లు పెరిగినందున గ్రామాల్లో కూడా ఒక్కో ఇంటికి రూ.2.8 లక్షల చొప్పున మంజూరు చేయాలని గ్రామీణ లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసినట్టు గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే గడువు బుధవారంతో ముగుస్తుందని చెప్పారు.



పదోన్నతుల కోసం పైసా వసూల్

- డీసీసీబీలో కలెక్షన్ కింగ్‌లు
- పోస్టును బట్టి రేటు
- రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...
- మొత్తం రూ.కోటి?

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో పదోన్నతులకు భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకులో కీలక స్థానంలో ఉన్నవారికి సన్నిహితులైనవారు (అనధికార వ్యక్తులు) చేతులమీదుగా ఈ వ్యవహారం సాగినట్టు ఫిర్యాదులు వచ్చాయి.

బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 33 బ్రాంచీలలో ఖాళీల మేరకు పదోన్నతులు కల్పించేందుకు గత నెల 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక డీజీఎం, నాలుగు ఏజీఎం, నాలుగు చీఫ్ మేనేజర్, ఆరు మేనేజర్, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు బోర్డును ఏర్పాటుచేశారు. ఇందులో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, సీఈవో, ఆప్కాబ్ నుంచి జనరల్ మేనేజర్, ఆప్కాబ్ నామినేట్ చేసిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఒకరు ఉన్నారు. డీజీఎం పోస్టుకు ఒకరు, నాలుగు ఏజీఎం పోస్టులకు నలుగురు, నాలుగు చీఫ్ మేనేజర్ పోస్టులకు 18 మంది, ఆరు మేనేజర్ పోస్టులకు 20 మంది, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 60 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. పదోన్నతుల ప్రక్రియలో 100 మార్కులు ఉంటాయి. ఇందులో 80 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి సర్వీస్‌కు సంబంధించి, మరో 10 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి పనితీరుపై ఆధారపడి (పైఅధికారి వేస్తారు) ఉంటాయి. మిగిలిన పది మార్కులకు ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూలన్నీ పూర్తిచేసి గత నెల 31న పదోన్నతులకు సంబంధించి ఆర్డర్లు ఇచ్చారు.

అయితే ఇంటర్వ్యూలు ... మిగతా 8వ పేజీలో

రక్తమోడిన రహదారి



మృతిచెందిన బాదంపూడి లక్ష్మి, గొంది పెంటయ్య

కొక్కిరాపల్లి వద్ద ఘోర ప్రమాదం



నుజ్జయిన టాటా మ్యాజిక్ వాహనం ముందుభాగం, రోడ్డు పక్కన బోల్తా పడిన ఆటో



అంబులెన్స్‌లో క్షతగాత్రుడికి ధైర్యం చెబుతున్న హోం మంత్రి అనిత

- ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొన్న టాటా మ్యాజిక్ వాహనం
- రోడ్డు పక్కకు బోల్తా పడిన ఆటో
- ఇద్దరి మృతి, ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- మరి కొందరికి స్వల్ప గాయాలు
- కొద్దిసేపటికి అదే మార్గంలో వెళుతూ కాన్వాయ్‌ని ఆపించిన హోం మంత్రి అనిత
- క్షతగాత్రులను త్వరగా ఆస్పత్రులకు తరలించేలా చర్యలు

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం బలంగా ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయంలో విశాఖ నుంచి నక్కపల్లి వెళుతున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.. వెంటనే తన కాన్వాయ్‌ని ఆపించారు.

పోలీసు సిబ్బందితోపాటు స్థానికుల సాయంతో వాహనాల్లో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను త్వరగా బయటకు తీయించి, ఆస్పత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ఈ సంఘటను సంబంధించి పోలీసులు, క్షతగాత్రులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

గాజువాక శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన బండి సాలేమ్‌రాజు కాకినాడ జిల్లా పిఠాపురంలో తమ బంధువుల ఇంట పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఏడుగురు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం టాటా మ్యాజిక్ వాహనంలో బయలుదేరారు. అదే ప్రాంతానికే చెందిన కె.నానిబాబు డ్రైవింగ్ చేస్తున్నాడు. ఉదయం ... మిగతా 8వ పేజీలో

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

- ఉమ్మడి జిల్లాల వారీగా సమాచారం పంపాల్సిందిగా పాఠశాల విద్యా శాఖ ఆదేశం
- వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడనున్న ఖాళీల వివరాల సేకరణలో అధికారులు
- పదవీ విరమణలు, పదోన్నతులతో భారీగానే ఖాళీలు?
- సుమారు 500 నుంచి 600 వరకు ఉండవచ్చునని ఉపాధ్యాయ సంఘాల అంచనా



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఖాళీల వివరాలు సిద్ధం చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశించింది. వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని కేటగిరీ వారీగా నివేదిక సిద్ధం చేయాలన్న ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ వివరాల సేకరణలో నిమగ్నమైంది.


ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో అన్ని కేటగిరీలు కలిపి ఉమ్మడి జిల్లాలో 1,134 మందిని ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరికి గత నెల తొలివారంలో నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 400 ఖాళీలు, ప్రభుత్వ, జడ్పీ పరిధిలోని పాఠశాలల్లో సుమారు 150 ఖాళీలను తాజా డీఎస్సీ ద్వారా భర్తీచేశారు. ఇంకా ఏజెన్సీతోపాటు మైదానంలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతినెలా పలువురు టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. 1989 నుంచి ... మిగతా 8వ పేజీలో

ఫణిగిరి ప్రదక్షిణ రేపు

మూడు మండలాల్లో 18 గ్రామాల మీదుగా 24 కి.మీ. సాగనున్న యాత్ర

- ఏర్పాట్లు చేస్తున్న దేవదాయ శాఖ

రాంబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5వ తేదీన పంచదార్లలో కొలువైన ఉమాధర్మలింగేశ్వరస్వామివారి ఫణిగిరి ప్రదక్షిణకు దేవదాయ శాఖ అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని నిర్వాహకులు భావిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున ధారభోగాపురం వద్ద మొదలయ్యే ఈ యాత్ర ధారపాలెం, పంచదార్ల, కొత్తూరు, గోకివాడ, మూలజంప, మడకపాలెం, చర్లోపాలెం, నరేంద్రపురం, మల్లవరం, ఉప్పవరం, యర్రవరం, కొండకర్ల, చోడపల్లి, అచ్యుతాపురం, వెదురువాడ, గొర్లె ధర్మవరం, వెంకటాపురం జంక్షన్ మీదుగా కొండదిగువన రాధామాధవస్వామి ఆలయానికి చేరుతుంది. ఇక్కడ ఆకాశ ధారలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. మూడు మండలాల పరిధిలో 24 కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొంటారన్న అంచనాతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఫణిగిరి ప్రదక్షిణ సాగే మార్గం



ఉమాధర్మ లింగేశ్వరస్వామి కొలువై ఉన్న ఫణిగిరి



శ్రీనివాస కల్యాణంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

కల్యాణం కమనీయం

- నర్సీపట్నంలో అంగరంగ వైభవంగా శ్రీనివాసుని వివాహ మహోత్సవం
- స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు
- కనులారా వీక్షించి తరించిన భక్తులు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియం సోమవారం రాత్రి మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మేళతాళాలు, కోలాటాలు, భజన బృందాలతో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శ్రీవారి సేవకులు పెదబొడ్డేపల్లి నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఊరేగింపుగా ... మిగతా 8వ పేజీలో



గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

అన్నదాతలకు కడగండ్లు

- తుఫాన్ వరదలతో నదుల గట్లకు గండ్లు
- కొట్టుకుపోయిన కాజ్‌వేలు
- ఏటవతల ఉన్న పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇక్కట్లు



భోగాపురం వద్ద కోతకు గురైన శారదా నది గట్టు



గవరవరం వద్ద వరద ధాటికి ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయిన కాజ్‌వే

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు శారదా నది ఉధృతంగా ప్రవహించడంతో మండలంలో పలు చోట్ల నది గట్లు కోతకు గురయ్యాయి. కాజ్‌వేలు నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. నదిలో వరద పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు ఆయా గ్రామాల రైతులు పొలాలకు వెళ్లడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది. తగరంపూడి గ్రోయిన్ వద్ద ఏటిగట్టుకు గండి పడడంతో భోగాపురం, చాకిపల్లి, పీఎస్ పేట, తదితర గ్రామాల రైతులకు పొలాలకు ఎలా వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ గట్టు పూర్తిగా తెగిపోయి ఉంటే పంటపొలాలు ముంపునకు గురయ్యేవని, పశువులు వరద నీటిలో కొట్టుకుపోయాయని అంటున్నారు. మరోవైపు గవరవరం వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో నదికి అవతల వైపున వున్న సుమారు రెండు వేల ఎకరాల పంటపొలాలకు వెళ్లేందుకు దగ్గర దారి లేకుండా పోయింది. కాజ్‌వే మీదుగా కె.కోటపాడు మండలం పైడంపేట, చౌడువాడ ప్రాంతాల ప్రజలు చోడవరానికి రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వే కొట్టుకుపోవడంతో రైతులు చుట్టూ తిరిగి పొలాలకు వెళ్లాల్సి వస్తున్నది. బెన్నవోలు వద్ద నది గట్టు బలహీనంగా మారింది. మరోసారి వరద వస్తే గండ్లు పడడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. ఇక రాయపురాజుపేట ఎర్రిగెడ్డపై ఉన్న కాజ్‌వే గతంలోనే ... మిగతా 8వ పేజీలో

కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద కలకలం

- ప్రధాన గేటుకు తాళాలు వేసి మాజీ కార్యదర్శి సమీహ మహ్మద్ మౌనదీక్ష
- వెంట పెట్రోల్, అగ్గిపెట్టె, కత్తి తేవడంతో స్థానికులు భయాందోళన
- సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్న పట్టణ పోలీసులు


పెట్రోలు, అగ్గిపెట్టె, కత్తి పట్టుకొని మౌనదీక్ష చేస్తున్న సమీహ మహ్మద్


మహిళను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం కలకలం రేగింది. ప్రధాన గేటుకు తాళాలు వేసి, అక్కడే పంచాయతీ మాజీ కార్యదర్శి సమీహ మహ్మద్ మౌనదీక్ష చేపట్టారు. ఆమె వెంట పెట్రోల్, అగ్గిపెట్టె, కత్తి తీసుకురావడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. దీనిపై పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన వచ్చి ఆమెను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇటీవల పంచాయతీ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, కార్యదర్శి సుభాష్‌లతో ఆమెకు వివాదం జరిగింది. దీనిపై స్థానిక యువకుడు కిర్ల కిశోర్, సమీహలపై సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిద్దరిపై అట్రాసిటీ కేసు నమోదుకు డీఎస్పీ శ్రావణి విచారణ చేపడుతున్నారు. అదే సమయంలో సమీహ కూడా పట్టణ పోలీసులకు సర్పంచ్, కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కొన్ని ప్లకార్డులపై పంచాయతీ రాజ్ శాఖామంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రావాలని డిమాండ్ చేస్తూ మౌనదీక్ష చేపట్టారు. అన్యాయంగా తొలగించిన తనకు పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

అర్జీదారులకు న్యాయం చేయాలి

- కలెక్టర్ విజయకృష్ణన్
- పీజీఆర్ఎస్‌లో 292 వినతులు


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వినతులు అందజేసిన అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోజేసీ జాహ్నవి, ఎస్ డీసీ సుబ్బలక్ష్మిలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మొత్తం 292 అర్జీలు అందాయని, వీటిని పరిష్కార నిమిత్తం ఆయా శాఖలకు పంపించామన్నారు. పౌరులు ఒకే సమస్యలపై పదేపదే కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతుల్లో పేర్కొన్న సమస్యలకు సత్వరం పరిష్కారం చూపుతామని పలువురు అర్జీదారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం ముగిసేసరికి 82 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లాలోని ప్రతి మండలంలో క్రీడా ప్రాంగణాలు : కలెక్టర్

అనకాపల్లి: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొనేవిధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటైన జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుడ్ని గుర్తించి వారికి సరైన ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆవిధంగా యువతకు మార్గదర్శకాలు చేయాలన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రతి మండలంలోనూ 25 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామన్నారు. యువత క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జేసీ జాహ్నవి, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇన్‌చార్జి డీఆర్‌వో సుబ్బలక్ష్మి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజ, డ్వామా పీడీ పూర్ణిమదేవి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి పాల్గొన్నారు


అనకాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం


అనకాపల్లిలో భారీ వర్షం

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై నాలుగు గంటల సమయంలో కుండపోతగా పడింది. ఈ కారణంగా రహదారులు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది. అలాగే విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట, భీమునిగుమ్మం జంక్షన్, పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్లలో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు కాలువల్లోకి చేరడంతో మురుగు రోడ్డుపైకి చేరింది. ఏది ఏమైనా వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో...

సమస్యలు పరిష్కారం కాకుంటే ఎలా..?

- సచివాలయ ఉద్యోగులను కంట్రోల్‌లో ఉంచాలి
- టీడీపీ నేతలను చిన్నచూపు చూస్తే సహించేది లేదు
- అధికారులకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ హెచ్చరిక


తహసీల్దార్, ఎంపీడీవోతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ కోరారు. ఈ మేరకు సోమవారం ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీసు స్టేషన్లలో పార్టీ శ్రేణులతో కలిసి అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్నా టీడీపీ నేతల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన సమస్యలైనా పరిష్కరించకుంటే ఎలా అని ప్రశ్నించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సైతం తమ కార్యకర్తలు, ముఖ్యనేతల సమస్యల పరిష్కరించడం లేదన్నారు. ఇలా అయితే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కింది స్థాయి సిబ్బంది విచ్చలవిడిగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నట్టు తమ కార్యకర్తలు, ముఖ్య నేతలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారిని అదుపులో పెట్టకుంటే సమస్యలు తప్పవని ఎంపీడీవో, తహశీల్దార్‌కు సూచించారు. అమృతపురంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కనిపించలేదన్నారు. ఎక్కడ ఉందో సర్వే చేసి హేండోవర్ చేసుకొని, ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కోరారు. ఇరువాడ సర్వే నంబర్లు 103, 106లలో గెడ్డ వాగులు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. ఇంటికి పన్ను వేసేందుకు వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కింది స్థాయి ఉద్యోగులను కంట్రోల్లో పెట్టాలని, లేదంటే పైస్థాయి అధికారులతో పాటు ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఫిర్యాదులు చేసిన వారినే పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని తన వద్ద సమాచారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొండి దేముడు, గండి వంశీదీప్, మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, నేతలు రేసుపూడి రమణ, బి.కన్నారావు, ఆడారి నాగరాజు, బర్ల రమణ, కోరాడ శ్రీను, ఎల్లాజీ, ఎ.నర్సింగరావు, ఆకుల గణేష, రెడ్డి దేముడు, బలిరెడ్డ అప్పారావు, గెడ్డం రమేశ్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్‌హౌస్

- ఆయుధాలు ప్రదర్శించి, పనితీరును విద్యార్థులకు వివరించిన ఎస్పీ తుహిన్‌సిన్హా


ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇక్కడి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు విధుల నిర్వర్తించే సమయంలో వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, పరికరాలను ప్రదర్శనగా ఉంచి, వాటి పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజల సేవకే ఉందని అంతా గుర్తించాలన్నారు. భవిష్యత్తులో పోలీసు కావాలనుకునే ప్రతిభావంతులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల విద్యార్థులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీతానగరంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీతానగరంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభమైంది. ఇక్కడ రసాయన రహిత రసాయనాలే, కాలుష్య లవణాలు, బయో కల్చర్ తెలుపు జిగురు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల ఉత్పత్తులు లభించనున్నాయని వెలుగు ఏపీఎం కొండమ్మ తెలిపారు. గ్రామస్థులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'హిమశేఖర్' విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలోని బుల్లయ్య కళాశాలలో ఈ నెల రెండో తేదీన జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రవల్లిక ప్రథమ బహుమతి గెలుచుకుంది. సోమవారం ఈమెను కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, లెక్చరర్ డాక్టర్ రామ్మోహనరావులు అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వివరించారు.


హేమగిరిపై గల సత్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు

రారండోయ్..
సత్యదేవుని వేడుక చూద్దాం

▸▸ సత్యనారాయణపురంలో గిరి ప్రదక్షిణ రేపు

▸▸ హేమగిరి, పరిసరాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


ఆలయంలో కొలువుదీరిన రమాలక్ష్మీసమేత స్వామివారు

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో బుధవారం గిరిప్రదక్షిణ జరగనుంది. ఇక్కడి హేమగిరిపై సత్యనారాయణస్వామి కొలువుదీరి ఉన్నారు. ఇప్పటికే హేమగిరిని అన్నవరం తరహాలో అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడ తొలిసారిగా గిరిప్రక్షిణ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ ఆలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. ప్రకృతి అందాలను చూసి పరవశించిపోతుంటారు. సామూహిక వ్రతాలు ఇక్కడ జరుపుతుంటారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ దేవస్థానానికి వందలాది ఎకరాల భూములున్నాయి. ఏటా ఆ భూములను కౌలుకు వేలం వేస్తుంటారు. ఆ వచ్చే నిధులతో నిత్య పూజలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కొండ రహదారికి మరమ్మతులు చేయించి పక్కాగా తీర్చిదిద్దారు. కొండ కింద ఉన్న ఆలయ ప్రాంగణంతో పాటు సమీపంలో ఉన్న తోటల్లో కార్తీకమాసం వస్తే ఒకటే సందడి. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వనభోజనాలకు వస్తుంటారు. సుమారు మూడు నెలల పాటు ఈ ప్రాంగణంలో వనమహోత్సవాలు జరుగుతాయి. శారదానగర్‌లో డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న రైల్వే వంతెన పక్కన సత్యదేవుని ఆర్చి వద్ద నుంచి బుధవారం ఉదయం ఆరు గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుందని ఆలయ చైర్మన్ అప్పికొండ గణేశ్ తెలిపారు. మూడు కిలోమీటర్ల వరకూ ఈ మొత్తం దారి ఉంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై, క్రింద ఉన్న సత్యదేవుని ఆలయాల్లో దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ గిరి ప్రదర్శనలో సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొంటారని అంచనా వేసి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

లోక శుభంకర నమో..నమో..

▸▸ కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాల్లో విశేష పూజలు ▸▸ వేకువజాము నుంచి పోటెత్తిన భక్తులు



సిద్ధిలింగేశ్వర ఆలయంలో అభిషేకం.., కాశీవిశ్వేశ్వర ఆలయంలో దీపారాధన


పరవాడ మండలం దేశపాత్రునిపాలెం ఆలయంలో పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి కోలాహలం ప్రారంభమైంది. అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, మార్కెట్ వద్ద గల శివాలయాల్లో విశేష అర్చనలు, అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ అమరపల్లి కృష్ణాజీ వీరిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఇదిలావుంటే, చిన రాజుపేటలోని చౌడేశ్వరి సాంబశివ ఆలయం వద్ద కార్తీక సోమవారం సందర్భంగా వంద మందికిపైగా భక్తులు లలితా సహస్రనామ పారాయణం, శివస్తుతిని అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పరవాడ : మండలంలోని శివాలయాలన్నీ సోమవారం భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. తాడి గ్రామంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, నీలబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయకులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే స్వయంభూవరం, లేమర్తి అగ్రహారం, దేశపాత్రునిపాలెం తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.


చౌడేశ్వరి సాంబశివ ఆలయంలో మహిళల పారాయణం

సబ్బవరం : మండలంలోని శైవక్షేత్రాలు సోమవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. అనకపల్లి కాశీ విశ్వే శ్వరస్వామి, దేవీపురంలోని దక్షవటి, వంగలి, లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వర స్వామి, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, పైడివాడ లోని స్వయంభూ సందీశ్వరస్వామి, సబ్బవరం, గొర్లివానిపాలెంలలోని ఉమా రామలింగేశ్వరస్వామి, పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, గణపతిపురంలోని మల్లికార్జున స్వామి, మొగలిపురంలోని విఘ్నేశ్వరాలయంలలో వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు : జడ్సీ


పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ముఖ్యంగా రహదారుల పరిశుభ్రత పై దృష్టి సారించారు. రోడ్లపై చెత్తాచెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు తెలిసినా, దుకాణాల ముందు ప్లాస్టిక్ ఉన్నా వెంటనే గుర్తించి ప్లాస్టిక్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో జరిగిన అధికారుల సమావేశంలో జడ్సీ మాట్లాడుతూ కార్యాలయ ఆవరణలో కూడా ఎవరూ ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కూడా నిషేధమని స్పష్టం చేశారు. ఎవరైనా వాటర్ తెచ్చుకోవాలంటే స్టీల్ లేదా గాజు సీసాలతో తెచ్చుకొని వినియోగించుకోవాలని సూచించారు.

తహశీల్దార్‌గా ఆనందరావు బాధ్యతలు


ఆనందరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి తహశీల్దార్‌గా జి.ఆనందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న తహశీల్దార్ అప్పారావు సెలవులోకి వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డీటీ శాంతిభూషణరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆనందరావు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడా ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కార్యాలయానికి వచ్చే ప్రజల పనులను సకాలంలో పూర్తిచేసే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతామని వివరించారు.

పుస్తక మహోత్సవానికి హోం మంత్రికి ఆహ్వానం

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను సోమవారం ఆమె నివాసంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి రావలసిందిగా సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య ఆమెను ఆహ్వానించారు. పుస్తక మహోత్సవాన్ని మంత్రి సందర్శిస్తారని ఆయన విలేకరులకు తెలిపారు.

కొక్కిరాపల్లి రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు పరామర్శ


క్షతగాత్రుడ్ని పరామర్శిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న వారిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పరామర్శించారు. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గొంది పెంటయ్య ఈ ఘటనలో గాయపడినట్టు తెలియడంతో ఆసుపత్రికి విచ్చేసి ఆయనతో పాటు మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

మెగా జాబ్ మేళా రేపు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయ్యే ఈ మేళాలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హలతో 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసుగల వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను ముందుగానే 'naipumyam.ap.gov.in' వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని రెజ్యూమ్‌లతో పాల్గొనాలని చెప్పారు మరిన్ని వివరాల కోసం 94947 91935 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో జీవనోపాధి కోల్పోయిన పట్టణంలోని చేనేత కార్మికుల కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక వీవర్స్ కాలనీలో 548 చేనేత కుటుంబాలకు టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబు, జనసేన నాయకుడు తోట నగేశ్, టీడీపీ నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి వంకా వెంకటరమణ, కూటమి నాయకులు పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, మలిపెద్ది వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు...

పాయకరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురంలో సోమవారం మత్స్యకారులకు నిత్యావసర సరుకులను టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు యాళ్ల వరహాలు, చించలపు ప్రదీప్, క్లస్టర్ ఇన్‌చార్జి వంకా వెంటరమణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు 50 కేజీల బియ్యం, నూనె, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, తదితర నిత్యావసర సరుకులను అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నీలాపు మహేశ్‌రెడ్డి, రావాడ గోవిందరెడ్డి, సురేశ్‌రెడ్డి, గొల్లపల్లి నాగు, వరహాలు, పేర్రాజు, ఏడిద సురేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు కైట్స్ విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అచ్యుతాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కైట్స్ విద్యావిహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేశ్ తెలిపారు. సోమవారం కె.కోటపాడు మండలం చౌడువాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపికలో తమ పాఠశాలకు చెందిన ఎం.మణికంఠ, డి కుశ్వంత్, బి. చంద్రతేజ ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు.

నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మునగపాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం రాజ్యాంగ దినోత్సవంపై జరిగిన పోటీల్లో ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడులు తెలిపారు. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గణపర్తి, మునగపాక, పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన నందవరపు జశ్వంత్, ఆడారి భవ్యశ్రీ, బొడ్డేడ బద్రీనాథ్‌లు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, ఎం.గోవింద, ఆర్.సత్తిబాబు, నూకేష్, అచ్యుతకృష్ణ పాల్గొన్నారు.

రేబాకలో శివాలయానికి శంకుస్థాపన

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాకలో శివాలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వేదపండితుడు బంకుపల్లి సత్యనారాయణ శర్మ పూజలతో శివాలయానికి శంకుస్థాపన చేశారు. ఎస్.రాయవరం మండలానికి చెందిన వేదపండితులు ఇరుకు సోంబాబు,అరుణ దంపతులు ఈ క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టుముక్కల రవికుమార్, సాదిరెడ్డి వర ప్రసాద్,త్రిపురాల రాము పాల్గొన్నారు.

వైసీపీ 'పేట' డిజిటల్ కో-ఆర్డినేటర్‌గా అప్పలరాజు

కోటవురట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):వైసీపీ పాయకరావుపేట డిజిటల్ కో-ఆర్డినేటర్‌గా మండలంలోని కైలాసపట్నం గ్రామానికి చెందిన పెన్నాడ అప్పలరాజు నియమితులయ్యారు. ఈయన గతంలో వైసీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పనిచేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్సీ డీవీసూర్యనారాయణ రాజు కృతజ్ఞతలు తెలిపారు.


డి.పట్టా, సాగు భూములకు పరిహారం ఇవ్వండి



పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గింజాల వెంకటరమణ

నక్కపల్లి,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా డి.పట్టాదారులు, సాగుభూముల తోటలకు సంబంధించి చాలా మందికి అన్యాయం జరుగుతోందని, ఇంకా అనేక మందికి నష్టపరిహారం ఇవ్వాలంటూ ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ప్రధాన కార్యదర్శి యువరాజ్‌ను డీఎల్‌పురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకట రమణ కోరారు. సోమవారం విజయవాడలో సంస్థ కార్యాలయంలో యువరాజ్‌ను కలిసి ఈ సమస్యపై వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేట, డీఎల్ పురం,చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట గ్రామాల్లో డి.పట్టాదారులు,సాగుభూముల యజమానులకు తోటలు, చెట్లకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదని ఆయన దృష్టికి తెచ్చారు.

గౌరీ దేవి అమ్మవారు ఊరేగింపు



గౌరీ దేవి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకు వస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సత్యవరానికి గౌరీశంకరులను సోమవారం తుని నుంచి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ప్రతీ ఏటా కార్తీక పౌర్ణమికి ముందు భక్తులు గౌరీదేవి అమ్మవారిని తుని సీతారామయ్య సిద్ధాంతి ఇంటి తీసుకు రావడం ఆనవాయితీ. రెండు వందల సంవత్సరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతుందని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కర్రసాములు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు.

'బీసీలకు మరిన్ని ప్రోత్సాహకాలు'

మునగపాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో బీసీలకు మరింత ప్రోత్సాహకాలు అందనున్నాయని గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ గొల్లపూడి బీసీ భవనంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సారథ్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారని తెలిపారు.

ముఖ్యమంత్రి వద్దకు తీసుకు వెళతా..

- రాజయ్యపేట మత్స్యకారులకు హోం మంత్రి అనిత భరోసా
- వేట లేకుండా ఎంతకాలం ధర్నా చేస్తారు ?



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మీరంతా నావాళ్లు.. కల్మషం లేనివారు... మీరు నా కాన్వాయ్‌ని ఆపి అడ్డగించినా.. హైవేను నాలుగు గంటలు దిగ్బంధం చేసినా.. నాకు ఎవరిపైనా కోపం లేదు.. నేను ఏమీ అనలేదు.. ఈ విషయం మీరంతా గుర్తించండి.. మీరంతా ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని వస్తే బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి సీఎం చంద్రబాబునాయుడు వద్దకు తీసుకెళతానంటూ' రాజయ్యపేట మత్స్యకారులకు హోం మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. రాజయ్యపేటకు చెందిన పలువురు మత్స్యకార నాయకులు, యువకులు బల్క్‌డ్రగ్ పార్కు సమస్య గురించి హోం మంత్రి అనితతో నక్కపల్లిలో చర్చించారు.

బల్క్‌డ్రగ్ పార్కును ఆపించాలని మత్స్యకారులు కోరారు. దీనిపై హోం మంత్రి అనిత స్పందించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తానెప్పుడూ సిద్ధంగా వున్నానని, సీఎం వద్దకు తీసుకెళ్తే కచ్చితంగా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో భారీ స్టీల్‌ప్లాంట్ వస్తుందని, క్యాప్టివ్ పోర్టు నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. తద్వారా అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఎన్నాళ్లు వేట లేకుండా ధర్నా చేస్తూ ఇబ్బందులు పడతారని ఆవేదన వెలిబుచ్చారు. తాము సీఎంను కలవడానికి సిద్ధమేనని, కమిటీని ఏర్పాటు చేసుకుంటామని, అంతవరకూ పనులు ఆపాలని మత్స్యకారులు కోరారు. త్వరగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో పనులు ఆపిస్తానని హామీ ఇచ్చారు.

హోం మంత్రి అనిత ప్రజాదర్బార్

- 400 పైగా అర్జీలు అందజేసిన ప్రజలు
- కారిడార్ నిర్వాసితుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్



అర్జీదారుల సమస్యను వింటున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో అర్జీలు అందజేశారు. భూ సంబంధ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, పక్కా ఇళ్లు, మత్స్య శాఖ అంశాలకు సంబంధించి 400పైగా ఫిర్యాదులు అందాయి. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మత్స్యకార గ్రామాల్లో నివసిస్తున్న ఇతర కులాల వారికి కూడా తుఫాన్ సరుకులు అందజేయాలని పలువురు కోరారు. ముకుందరాజుపేటలో వేరొకరికి పడిన తల్లికి వందనం నగదును అర్హులైన తమకు ఇవ్వాలని కొంతమంది అర్జీ అందజేశారు. బుచ్చిరాజుపేటలో భూ ఆక్రమణలు, ఏపీఐఐసీ సేకరించిన భూముల పరిహారం కోసం వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేస్తానని చెప్పారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



రాంబిల్లి: ఉమాధర్మలింగేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు



మునగపాకలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



మునగపాక శూలాల సంబరంలో సాంబశివుడికిప్రత్యేక అలంకరణ

- శివనామ స్మరణతో మార్మోగిన పంచదార్ల

రాంబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం మండలంలోని పంచదార్ల పుణ్యక్షేత్రం భక్తుల శివనామ స్మరణలతో మార్మోగింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చారు. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తరువాత సహస్ర లింగేశ్వరస్వామి, రాధామాధవస్వామి, లలితా సహస్రలింగేశ్వరస్వామి, ద్విముఖ వినాయకస్వామి, సాయిబాబాను దర్శించుకున్నారు.

సాంబశివుడును దర్శించుకున్న ఎస్పీ తుహిన్ సిన్హా



నక్కపల్లి ఉపమాకలో శివలింగానికి పూజలు చేసిన దృశ్యం

మునగపాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. స్థానిక సాంబమూర్తి శూలాలు ఉత్సవంలో భాగంగా సాంబశివుడును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. జాగ్రత్తలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులు, పోలీసులను ఆదేశించారు. వర్షం పడినందున విద్యుత్ వైర్లు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే విజయకుమార్ శివలింగానికి పాలు, పెరుగు, జలాభిషేకాలు చేశారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి దేవస్థానం కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాలు రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు వెంకట సతీష్‌కుమార్ సాంబశివుడును దర్శించుకున్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సత్యవరం, నామవరం, గోపాలపట్నం సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, గోపాలపట్నం, పెంటకోట, రాజగోపాలపురం గ్రామాలలోని శివాలయాలకు తెలవారుజాము నుంచే భక్తులు చేరుకోవడంతో కిటకిటలాడాయి. ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోపాలపట్నం సీతమ్మవారి కొండపై వెలసిన ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి తుని, పాయకరావుపేట, నక్కపల్లి తదితర మండలాలలోని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులకు అన్న సమారాధన చేశారు.

నక్కపల్లిలో..

మండలంలోని ఉపమాక, గొడిచెర్ల శివాలయాలకు కార్తీకమాసం రెండో సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ముక్కంటికి పంచామృతాభిషేకాలు నిర్వహించి హారతులిచ్చారు. ఉపమాక శివాలయంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గొడిచెర్ల శేష లింగేశ్వరస్వామి ఆలయంలో కూడా అన్నదానం చేశారు.

ఎస్.రాయవరంలో..

కార్తీకమాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గెడ్డపాలెం, సర్వసిద్ధి, పెదఉప్పలం, పెనుగొల్లు, ఎస్. రాయవరం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తుల తాకిడి నెలకొంది.



పాయకరావుపేటరూరల్ :గోపాలపట్నం సీతమ్మవారి కొండపైకి వచ్చిన భక్తులు



మునగపాక సాంబశివుడును దర్శించుకున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

జయహో భారత్

పాయకరావుపేట, నక్కపల్లిలో క్రికెట్, హాకీ అభిమానుల సంబరాలు



పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న క్రికెట్ క్రీడాకారులు

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ పోటీల్లో భారత క్రికెట్ జట్టు అద్భుత విజయం సాధించడం పట్ల క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. సోమవారం స్థానిక ఆట స్థలంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు గొల్లపల్లి నాగు, గెడ్డం చైతన్య, ధనిశెట్టి బాబి తదితరులు త్రివర్ణ పతకానికి గౌరవ వందనం చేసిన అనంతరం స్వీట్లు పంచుకుని బాణసంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పి.చిన్న, టి.కళ్యాణ్, నూకరాజు, బుజ్జి, ఎస్.చిన్న, మణికంఠ, నూకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నక్కపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న హాకీ క్లబ్ క్రీడాకారులు

నక్కపల్లిలో..

మహిళా క్రికెట్ ప్రపంచకప్‌ను తొలిసారిగా భారత్ సాధించడం పట్ల సోమవారం నక్కపల్లిలో హాకీ క్రీడాకారుల సంబరాలు జరుపుకున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో బీఎస్ హాకీ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు త్రివర్ణ పతకాలను పట్టుకొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలిసారి భారత్ మహిళా క్రికెట్ టీం ప్రపంచ కప్‌ను సాధించడం చాలా గర్వకారణమని బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు అన్నారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు చిన్న అప్పారావు,కార్యదర్శి తాతాజీ, రామచంద్రరావు, రాంబాబు, రంజిత్, నానాజీ పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోని ఆస్పత్రి అంబులెన్స్



సీహెచ్‌సీ ముందు టార్పాలిన్ కప్పి ఉన్న ఆస్పత్రి అంబులెన్స్

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. ఎలమంచిలి సీహెచ్‌సీలోని అంబులెన్స్ ఆపద సమయంలో కూడా ఉపయోగపడడం లేదు. సోమవారం కొక్కిరాపల్లి వద్ద ఆటో, వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో 14 మందికి పైగా గాయపడ్డారు. వీరిని విశాఖ, అనకాపల్లి ఆస్పత్రులకు తరలించేందుకు 108 వాహనంతో పాటు సమీపంలోని పరిశ్రమలకు చెందిన అంబులెన్స్‌ల పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎలమంచిలి ఆస్పత్రి ఆరణలో ఉన్న అంబులెన్స్‌కు టార్పాలిన్‌లు కప్పి అలంకారంగా ఆస్పత్రి ముందు ఉంచారే తప్ప దానిని వినియోగించలేదు. అధికారులు, పాలకులు కనీసం అంబులెన్స్‌ను కూడా వినియోగంలోకి తేలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఆస్పత్రి అంబులెన్స్ రోగులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తమలపాకు రైతులను ఆదుకోవాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సత్యవరంలో తమలపాకు తోటలను పరిశీలిస్తున్న అమర్‌నాథ్, తదితరులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌కు తీవ్రంగా నష్టపోయిన తమలపాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని సత్యవరంలో తుపాన్‌తో నేలకొరిగిన తమలపాకు తోటలను వైసీపీ నేతలతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ మండలంలో తమలపాకు తోటలకు భారీ నష్టం జరిగిందన్నారు. కేవలం నేలకొరిగిన 100 ఎకరాలలో తోటలను మాత్రమే ఎన్యూమరేట్ చేశారని, నిలబడి చనిపోతున్న తోటలను కూడా ఎన్యూమరేట్ చేసి వారికి కూడా నష్ట పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కార్యదర్శులు చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, వైసీపీ మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, మధువర్మ, వైసీపీ నాయకులు పైల రమేశ్, ధనిశెట్టి బాబూరావు, సఖిలేటి రాము, జగతా శ్రీనివాసరావు, శీరం నరసింహమూర్తి, పడాల కృష్ణ, వి. రామారావు, పన్నీరు పాపారావు, సుందరలత, శ్రీదేవి, గంగారావు పాల్గొన్నారు.

బృందగాన పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థినుల ప్రతిభ



బృందగాన పోటీల్లో గీతాలు ఆలపిస్తున్న శ్రీప్రకాష్ విద్యార్థినులు

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ రీజనల్ బృందగాన పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ వివరాలు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో సౌత్ రీజనల్ బృందగాన పోటీల్లో ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు కె.పోలిన్ కెల్లీ, ఎం.దేవి దీపిక, ఎస్.శ్రీలాస్య, ఎం.లక్ష్మి నికిత, లాస్య త్రివేణి, ఎస్.సత్యశ్రీ అశ్విత, యు.లాస్యప్రియ తెలుగు జానపద గీతాల్లో అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారన్నారు. అదేవిధంగా హిందీ, సంస్కృతం పాటల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. విద్యార్థినులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి బి.ప్రసూనమౌళి అభినందనలు తెలిపారు.

కొక్కిరాపల్లి పాఠశాలకు బీరువా, సౌండ్ సిస్టం వితరణ



ఉపాధ్యాయులకు బీరువా, బ్లూ టూత్ సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ రామకృష్ణ

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి ప్రాథమిక పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ అవధానుల వేణు లాన్స్ ఫౌండేషన్ ద్వారా రూ.15 వేలు విలువ చేసే బీరువా, బ్లూ టూత్ సౌండ్ సిస్టమ్‌ను వితరణగా ఇచ్చినట్టు హెచ్ఎం కే విశ్వేశ్వరరావు తెలిపారు. వీటిని స్థానిక కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, శివరామ్‌ల చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.పాపాజీరావు, బాబూరావు పాల్గొన్నారు.

తహశీల్దారు మహేశ్వరరావుకు పలువురు అభినందన



తహశీల్దారు మహేశ్వరరావుని సత్కరిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌లో విశేష సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ పనితీరు అవార్డును అందుకున్న తహశీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావుని సోమవారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జనసేన నాయకుడు తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీను తదితరులు తహశీల్దారుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి పాల్గొన్నారు.



రహదారిపై వారపు సంతతో చిందరవందరగా ఉన్న వాహనాలు

రోడ్డుపై సంత.. వాహన చోదకుల చింత

- ఏఎల్ పురంలో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు.. ప్రజల అగచాట్లు

కృష్ణాదేవిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం రహదారిపైనే వారపు సంత నిర్వహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సోమవారం జరిగే సంతకు గొలుగొండ, కొయ్యూరు, చింతపల్లి, గూడెంకొత్తవీధి తదితర మండలాలకు చెందిన గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన రైతులు కూరగాయలను తీసుకువస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రాంతాల వ్యాపారులు వస్తుంటారు. రహదారిపైనే కూరగాయాలు, ఇతర లావాదేవీల కోసం దుకాణాలు పెట్టడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంత వేలం పాట నుంచి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ అధికారులు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదు. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టిసారించినప్పటికీ ఫలితం కానరావడం లేదు. ఇప్పటికైనా సంత నిర్వహణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామానికి దూరంగా ప్రత్యేక ప్రదేశం ఏర్పాటు చేయడంపై దృష్టిసారించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడివాడ విద్యార్థిని



పోటీలకు ఎంపికైన భాగ్యశ్రీ, హెచ్ఎం రామారావు

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.భాగ్యశ్రీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. మూడు రకాల ఆటల పోటీల్లో సత్తా చాటి ఈ పోటీలకు అర్హత సాధించింది. పదో తరగతి చదువుతున్న భాగ్యశ్రీ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 100, 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం రామారావు తెలిపారు. భాగ్యశ్రీ, పీఈటీలను ఆయన అభినందించారు.

పట్టాలు ఇవ్వాలని గిరిజనుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. మాడుగుల మండలంలోని లోవపొన్నవోలు పంచాయతీ ఎల్.పొన్నవోలు, ఓండ్రువీధి, దిబ్బూరు గ్రామాల గిరిజనులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. పూర్వీకుల నుంచి భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమని గిరిజనులు వాపోయారు. సర్వే నంబర్ 47లో 199.47 సెంట్ల భూమిలో వివిధ రకాల పంటలను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.

జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాలబాలికల ఎంపిక



జిల్లా స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కె.కోటపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాల బాలికల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో గన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేశ్, అనకాపల్లి స్కూల్ గేమ్స్ సెక్రటరీ కెఎం నాయుడు, పాఠశాల హెచ్ఎం జీవీ.రాజు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

తామరంలో యూరియా సరఫరా

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



పంపిణీ కోసం గోదాము నుంచి తీసిన బస్తాలు

మాకవరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తామరం గ్రామంలో ఎట్టకేలకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. 'ఎరువు.. రైతులకు కరువు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై పీఏసీఎస్ అధ్యక్షుడు శీరంరెడ్డి నాగవెంకట చినబాబు, వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈ మేరకు రైతులకు సుమారు 300 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. అనంతరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో యూరియా కొరత రాకుండా పంపిణీ చేశామన్నారు. సుమారు 840 టన్నుల యూరియాను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.అప్పారావు, సిబ్బంది శేషునాయుడు పాల్గొన్నారు.

పద్య పఠన పోటీలకు 300 మంది హాజరు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వ ర్యంలో జరుగుతున్న బాలల ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా రమణ, సంతోషి, లక్ష్మణ్ వ్యవహించారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.

నల్ల బజారుకు కోటా బియ్యం

రైస్ మిల్లుకు ఆటోలు, వ్యాన్లలో అక్రమంగా తరలింపు

పట్టించుకోని అధికారులు.. ఇష్టారాజ్యంగా వ్యాపారులు



కొత్తకోట నుంచి రోలుగుంట రైస్ మిల్లుకు ఆటోలో తరలిస్తున్న కోటా బియ్యం

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోటా బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. ఆటోలు, వ్యాన్లలో రైస్ మిల్లులకు యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులకు పట్టకపోవడంతో అక్రమ తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతోంది.

ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రోజూ ఆటోలు, వ్యాన్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు గ్రామాలలో తిరిగి కార్డుదారుల వద్ద కిలో రూ.15 నుంచి రూ.16, మరి కొంత మంది నేరుగా డీలర్ల వద్ద రూ.18 నుంచి రూ.20కు కొనుగోలు చేసి అక్రమంగా వ్యాపారం సాగిస్తున్నారు. లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిల్లులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిసింది. నమ్మకమైన వ్యాపారులకు రైస్ మిల్లుల యజమానులు ముందుగానే కోటా బియ్యం కొనుగోలుకు పెట్టుబడిగా కొంత సొమ్ము ఇస్తున్నారని సమాచారం. తరువాత బియ్యం మిల్లులకు తెచ్చినప్పునప్పుడు మిగిలిన సొమ్మును అందిస్తున్నారని తెలిసింది. ఇలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని మళ్లీ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మేడివాడ, కొత్తకోట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని రోలుగుంట రైస్ మిల్లుకు, రావికమతం నుంచి ఎర్రవాయి, బుచ్చియ్యపేట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని చోడవరం-వెంకన్న పాలెం రైస్ మిల్లులకు వ్యాపారులు తరలిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఉనతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి తగిన చర్యలు చేపడితే అవకతవకలు బయటపడతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



చోడవరంలోని ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు





మాడుగుల: ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు... దేవరాపల్లిలోని తిమిరాం ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

తెల్లవారు జాము నుంచే పూజలు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులతో పోటెత్తాయి. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అయితే కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోటుచేసుకున్న దుర్ఘటన నేపథ్యంలో శైవక్షేత్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. స్థానరిక స్వయంభూ గౌరీశ్వరాయలం, ముద్దుర్తిలోని పుణ్య స్నానాలు ఆచరించే సంగమయ్య గుడి వద్ద, గవరవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, జుత్తాడలోని శివాలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వయంభూ గౌరీశ్వరాలయం, ముద్దురి సంగమేశ్వరాలయం వద్ద తెల్లవారు జాము నుంచే పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద తొక్కిసలాట జరగకుండా భక్త లను దర్శనానికి పంపారు. దీంతో ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట రామ భోగలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం కిటకిటలాడింది. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది. వేకువ జాము నుంచి పురోహితులు అభిషేకాలు నిర్వహించారు. వడ్డాది, విజయరామ రాజుపేట, రాజాం, నీలకంఠపురం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

మాడుగులలో...

మాడుగుల: మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. హర హర మహాదేవ.. శంబో శంకర.. అంటూ భక్తులు స్మరించారు. కార్తీకమాస రెండో సోమవారం కావడంతో మాడుగుల కేంద్రంలోని శివాలయాలకు తెల్లవారు 2 గంటల సమయానికి భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. సమీపంలోని బావుల వద్ద చన్నీటి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మాడుగుల కేంద్రంలో కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వర, భీమలింగేశ్వర, స్వర్గలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు రద్దీ ఏమాత్రం తగ్గలేదు. మండల పరిసర గ్రామాల్లో చరిత్ర కలిగిన జంపెన శివాలయం, ఎం.కోడూరు కాశీవిశ్వేశస్వామి ఆలయాలకు కూడా భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని శివాయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిమిరాం శివాలయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వనదేవీశ్వర ఆలయం, పెద నందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ,తెనుగుపూడి శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చోడవరం, చీడికాడ, దేవరాపల్లి మండలాలనుంచి భక్తులు తిమిరాం శివాలయానికి అధిక సంఖ్యలో వెళ్లారు.



కె.కోటపాడు గౌరీపరమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల కేంద్రంలోని గౌరీపరమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు జేగురుపాటి భీమలింగేశ్వరరావుస్వామి వారికి మారేడు దళాలతో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం హర హర మహాదేవ.. నినాదాలతో మార్మోగింది. మహిళలు దీపాలు వెలిగించి వ్రతాలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు శరగడం సన్యాసినాయుడు, సంఘం మహిళలు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండలంలో శివాలయాలు భక్తులతో పొటెత్తాయి. చమ్మచింత కాశీఅన్నపూర్ణేశ్వరస్వామి ఆలయం దగ్గర భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివునికి అభిషేకాలు చేశారు. వీరభూపతిఅగ్రహారంలో పురాతన రామాలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం మాజీ ఛైర్మన్ అపన దివాణం దంపతులు పూజలో పాల్గొన్నారు. అలాగే జిల్లేడిపూడి నూకంబికాదేవి ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తులో ఉన్న శివలింగానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు

- పీపీపీ విధానంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కృషి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటరమణ

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ హెచ్చరించారు. పెదబొడ్డేపల్లి ఏఎంసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులు రోజుకు రూ.2,500 టర్నోవర్ ఉంటే తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని 31 మందికి నోటీసులు జారీ చేయగా, 11 మంది ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు వచ్చారని తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత చెక్‌పోస్టులు ఆకస్మిక తనిఖీలు చేయడం ద్వారా రూ.15 లక్షలు అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఆర్టీసీ కార్గో బస్సులో మార్కెట్ సెస్సు చెల్లించకుండా తరలిస్తున్న తొమ్మిది టన్నులు పైగా జీడి పప్పును రాజుపాకల చెక్ పోస్టు వద్ద పట్టుకొని రూ.60 వేల పైగా సెస్సు కట్టించామని ఆయన తెలిపారు. మొదటి శ్రేణి ధాన్యానికి రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధర ఇస్తున్నట్టు చెప్పారు. మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్‌ని పీపీపీ విధానంలో ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుఆదేశాలతో రైతు బజార్‌ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోటవురట్ల రోడ్డు వైపు షాపులు నిర్మించడానికి రూ.90 లక్షలతోను, మార్కెట్ యార్డులో రూ.45 లక్షలతో షాపులు, గోదాములు మరమ్మతులకు అంచానాలు తయారు చేయించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కన్నయ్యనాయుడు, కార్యదర్శి భువనేశ్వరి పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా



రామన్నపాలెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల కోసం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాడారని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు పేర్కొన్నారు. రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం బిర్సా ముండా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం వరహాలబాబు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు ముండా అని పేర్కొన్నారు. పార్లమెంట్ హాలులో బిర్సా ముండా చిత్రపటం ఏర్పాటు చేయడం గిరిజనులకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. విద్యార్థులు ముండా జీవితం గురించి తెలుసుకోవాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచనను వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరిస్తున్నట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చింతలబుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ మండలఅధ్యక్షుడు బూరే బాబూరావు, నాయకులు లలితానాయుడు, కేవీ.రమణ పాల్గొన్నారు.

'పీపీపీ విధానం రద్దు చేయాలి'

మాకవరపాలెం, నంవబరు 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలకు పీపీపీ విధానం అమలును రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొండలఅగ్రహారంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సంతకాల కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీపీపీ విధానం రద్దు చే సేవరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, ఎంపీపీ సర్వేశ్వరావు, వైసీపీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని బీజేపీ కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. పార్టీ కార్యాలయంలో పట్టణ విభాగం అధ్యక్షుడు బొళెం అప్పన్నదొర, రూరల్ అధ్యక్షుడు నిద్ర శ్రీను ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు బూత్ కన్వీనర్లు నియామకాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ కేవీ సత్యనారాయణ, గాదె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేయండి

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బిల్ కలెక్టర్ అవినీతికి పాల్పడినట్టు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అన్యాయమని వాపోయారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ర్యాలీ

నరీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించాలని సోమవారం భారీ ర్యాలీ జరిగింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అబీద్ సెంటర్ వరకు, కలెక్టర్ కార్యాలయం వరకు వచ్చి ఆర్డీవో వీవీరమణకు వినతి పత్రం ఇచ్చారు. దాడులు, వేధింపులు, అత్యాచారాలు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, గీతాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం ప్రధాన రహదారి ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

చెట్టుపల్లిలో నూతన పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ కోటా పింఛన్లను కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ ఇవ్వాల్సిన ఫించన్లను లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం అందజేశారు. భర్త చనిపోయి 20 రోజులకు ముందే ప్రభుత్వం నూతన పంచన్లు మంజూరు చేస్తున్నదని ఈ సందర్భంగా కూటమి నాయకులు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గజాల సూరిబాబు, జనసేన ఉమ్మడి విశాఖ ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, నాయకులు ఇన్నం రమణ, సతీశ్, ఎ.రాజు పాల్గొన్నారు.

నైపుణ్య పరీక్షల్లో విద్యార్థినుల ప్రతిభ

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో బ్యూటీ, వెల్‌నెస్‌ట్రేడ్‌కు చెందిన నైపుణ్యంపై సోమవారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఫేషియల్, త్రెడింగ్, మెడిక్యూర్, పెడిక్యూర్, మేకప్ తదితర విభాగాల్లో గ్రూపులు వారీగా పోటీలు జరిగాయి. 15 బృందాల మధ్య జరిగిన పోటీల్లో రెండు బృందాలు గెలుపొందారు. ప్రత్యేకాధికారి భువనమాధురి విజేతకు బహుమతులు అందజేశారు. అలాగే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఎనిమిది మంది విద్యార్థినులు ఈ నెల 7న మాడుగలలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆమె తెలిపారు. ఒకేషనల్ టీచర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నల్ల బజారుకు కోటా బియ్యం

రైస్ మిల్లులకు ఆటోలు, వ్యాన్లలో అక్రమంగా తరలింపు
పట్టించుకోని అధికారులు.. ఇష్టారాజ్యంగా వ్యాపారులు

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోటా బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. ఆటోలు, వ్యాన్లలో రైస్ మిల్లులకు యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులకు పట్టకపోవడంతో అక్రమ తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతోంది.

ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రోజూ ఆటోలు, వ్యాన్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు గ్రామాలలో తిరిగి కార్డుదారుల వద్ద కిలో రూ.15 నుంచి రూ.16, మరి కొంత మంది నేరుగా డీలర్ల వద్ద రూ.18 నుంచి రూ.20కు కొనుగోలు చేసి అక్రమంగా వ్యాపారం సాగిస్తున్నారు. లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిల్లులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిసింది. నమ్మకమైన వ్యాపారులకు రైస్ మిల్లుల యజమానులు ముందుగానే కోటా బియ్యం కొనుగోలుకు పెట్టుబడిగా కొంత సొమ్ము ఇస్తున్నారని సమాచారం. తరువాత బియ్యం మిల్లులకు తెచ్చినప్పుడప్పుడు మిగిలిన సొమ్మును అందిస్తున్నారని తెలిసింది. ఇలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని మళ్లీ మిల్లుల్లో రీ సైక్లింగ్ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మేడివాడ, కొత్తకోట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని రోలుగుంట రైస్ మిల్లుకు, రావికమతం నుంచి ఎర్రవాయి, బుచ్చియ్యపేట పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని చోడవరం-వెంకన్న పాలెం రైస్ మిల్లులకు వ్యాపారులు తరలిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఉనతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి తగిన చర్యలు చేపడితే అవకతవకలు బయటపడతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తకోట నుంచి రోలుగుంట రైస్ మిల్లుకు ఆటోలో తరలిస్తున్న కోటా బియ్యం

250 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచి పెడుతున్నామని ఏఈ డి.సూర్య తెలిపారు. రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా, సోమవారం నాటికి 458.08 అడుగులకు చేరిందన్నారు. దీంతో రెండు గేట్లు ఎత్తివేసి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచి పెట్టినట్టు ఏఈ చెప్పారు.

క్వారీ వాహనాలతో రహదారులు ధ్వంసం

రోలుగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజన్నపేట క్వారీ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని అర్ల, రాజన్నపేట, గుర్రాలబైల గ్రామాల గిరిజనులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వడ్డిప నుంచి గదబపాలెం, గుర్రాలబైల, అర్ల వరకు పీఎం సడక్ యోజన కింద తారు రోడ్డు నిర్మాణం చేపట్టారని, నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. అలాగే 108 వాహనం రావడానికి కూడా ఆస్కారం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ మార్గంలో రవాణాకు ఆటంకం లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.గోవిందరావు, నీలపు శ్రీను, చిన్ని రమణ తదితరులు పాల్గొన్నారు.



క్వారీ వాహనాలను ఆపాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడివాడ విద్యార్థిని

రావికమతం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.భాగ్యశ్రీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. మూడు రకాల ఆటల పోటీల్లో సత్తా చాటి ఈ పోటీలకు అర్హత సాధించింది. పదో తరగతి చదువుతున్న భాగ్యశ్రీ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 100, 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం రామారావు తెలిపారు. భాగ్యశ్రీ, పీఈటీలను ఆయన అభినందించారు.



పోటీలకు ఎంపికైన భాగ్యశ్రీ, హెచ్ఎం రామారావు

పట్టాలు ఇవ్వాలని గిరిజనుల ఆందోళన

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. మాడుగుల మండలంలోని లోవపొన్నవోలు పంచాయతీ ఎల్.పొన్నవోలు, ఓంద్రువీధి, దిబ్బూరు గ్రామాల గిరిజనులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. పూర్వీకుల నుంచి భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమని గిరిజనులు వాపోయారు. సర్వే నంబర్ 47లో 199.47 సెంట్ల భూమిలో వివిధ రకాల పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని కోరార. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న గిరిజనులు

జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాలబాలికల ఎంపిక

కె.కోటపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ అండర్-14 పోటీలకు బాల బాలికల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేశ్, అనకాపల్లి స్కూల్ గేమ్స్ సెక్రటరీ కెఎం నాయుడు, పాఠశాల హెచ్ఎం జీవీ.రాజు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల కోసం స్వాతంత్ర్య సమారయోధుడు బిర్సా ముండా పోరాడారని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు పేర్కొన్నారు. రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం బిర్సా ముండా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం వరహాలబాబు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు ముండా అని పేర్కొన్నారు. పార్లమెంట్ హాలులో బిర్సా ముండా చిత్రపటం ఏర్పాటు చేయడం గిరిజనులకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. విద్యార్థులు ముండా జీవితం గురించి తెలుసుకోవాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచనను వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరిస్తున్నట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, నాయకులు లలితానాయుడు, కేవీ.రమణ పాల్గొన్నారు.







చోడవరంలోని ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు.. స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద బందోబస్తులో పోలీసులు



శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక సోమవారం ఆలయాల వద్ద పోలీసుల బందోబస్తు

కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో గుడుల వద్ద పెరిగిన భద్రత



బుచ్చెయ్యపేట మండలంలోని సీతయ్యపేట శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులతో పోటెత్తాయి. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అయితే కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోటుచేసుకున్న దుర్ఘటన నేపథ్యంలో శైవక్షేత్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. స్థానిక స్వయంభూ గౌరీశ్వరాయలం, ముద్దుర్తిలోని పుణ్య స్నానాలు ఆచరించే సంగమయ్య గుడి వద్ద, గవరవరం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, జుత్తాడలోని శివాలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వయంభూ గౌరీశ్వరాలయం, ముద్దురి సంగమేశ్వరాలయం వద్ద తెల్లవారు జాము నుంచే పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద తొక్కిసలాట జరగకుండా దగ్గరుండి భక్తులను దర్శనానికి పంపారు. దీంతో ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట రామ భోగలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం కిటకిటలాడింది. శివ నామ స్మరణతో ఆలయం మార్మోగింది. వేకువ జాము నుంచి పురోహితులు అభిషేకాలు నిర్వహించారు. వడ్డాది, విజయరామరాజుపేట, రాజాం, నీలకంఠపురం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.









చెట్టుపల్లిలో నూతన పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ కోటా పింఛన్లను కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్లను లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం అందజేశారు. భర్త చనిపోయి 20 రోజులకు ముందే ప్రభుత్వం నూతన పంఛన్లు మంజూరు చేస్తున్నదని ఈ సందర్భంగా కూటమి నాయకులు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గజాల సూరిబాబు, జనసేన ఉమ్మడి విశాఖ ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, నాయకులు ఇన్నం రమణ, సతీశ్, అప్పికొండ రాజు పాల్గొన్నారు.





చోడవరంలో వర్షం



చోడవరం రోడ్డుపై పడుతున్న వాన

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే వరుస అల్పపీడనాలు, తుఫన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనానికి, సోమవారం సాయంత్రం మండలంలో మరోసారి వర్షం కురవడంతో బెంబేలెత్తిపోతున్నారు. తుఫాన్‌తో కురిసిన భారీ వర్షంతో శారదా, పెద్దేరు నదులు పొంగిపొరి పంటపొలాలు ముంపుకు గురైన సంగతి తెలిసిందే. పొలాల్లోని నీరు ఇపుడిపుడే తగ్గుతున్న పరిస్థితుల్లో మరోసారి వర్షం భారీ స్థాయిలో వర్షం కురవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి సుమారు గంటకు పైగా భారీగా వర్షం కురిసింది. దీంతో ఇంకా వర్షాలు కురుస్తాయేమోనన్న ఆందోళన రైతులను వెంటాడుతున్నది. వర్షాలు తెరిపివ్వకపోతే పంటలకు దక్కే పరిస్థితి ఉండబోదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.














మాడుగులలో..

మాడుగుల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓ మాదిరిగా ఎండ కాసింది. అనంతరం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశమంతా మేఘావృతమై తేలికపాటి జల్లులతో మొదలై మోస్తరు వర్షం పడింది.





పద్య పఠన పోటీలకు 300 మంది హాజరు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల ప్రతిభా పాఠవ పోటీలలో భాగంగా సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా రమణ, సంతోషి, లక్ష్మణ్ వ్యవహించారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.







రుణ అక్రమార్కులపై చర్యలు

» వైసీపీ హయాంలో అడ్డగోలుగా అప్పులు మంజూరు

» డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు



డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేస్తున్న కోన తాతారావు

కోటవురట్ల, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పంట రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించామని, అక్రమాలకు పాల్పడిన సొసైటీల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు చెప్పారు. సోమవారం ఇక్కడ నాత వరం, పీకేగూడెం శృంగవరం, మాకవరపాలెం, కోటవురట్ల సొసైటీల పర్సన్‌ఇన్‌చార్జులు, కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేసి అక్రమాలకు పాల్పడ్డారని, అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ.572 కోట్ల పంట రుణాలు మంజూరుచేశామని, రానున్న రబీలో విరివిగా పంట రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి అన్ని సహకార సంఘాలకు గోదాములను సమకూర్చి, రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో వర్మ, డీజీఎం అశోక్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, డీసీసీబీ మేనేజర్ అప్పారావు పాల్గొన్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

1998 మధ్య డీఎస్సీ ద్వారా నియమితులైన పలువురు టీచర్లు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు, వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పదవీ విరమణ చేయనున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టులకు స్కూలు అసిస్టెంట్లతో భర్తీచేయనున్నారు. దీంతో స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీలు ఏర్పడనున్నాయి.

ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొందరు టీచర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి ఏర్పడబోయే ఖాళీల వివరాలను మండల విద్యాశాఖాధికారుల నుంచి జిల్లా విద్యా శాఖ సేకరిస్తోంది. వచ్చే ఏడాది మే నెలాఖరుకల్లా సుమారు 500 నుంచి 600 వరకు ఖాళీలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మండలాల నుంచి పూర్తి వివరాలు వచ్చిన తరువాత గానీ ఖాళీలపై స్పష్టత రాదని అంటున్నారు. పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీల వివరాలు నివేదిక సిద్ధం చేస్తున్నామని విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

అన్నదాతలకు కడగండ్లు

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోగా, ఊరగెడ్డ వద్ద ఉన్న చిన్న వంతెన గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రాయపురాజుపేట రైతులు ఊరగెడ్డకు అవతల వైపు వున్న పంట పొలాలకు వెళ్లిరావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి చోడవరం మండల పరిధిలో పెద్దేరు, శారదా నదుల గట్ల పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'పేట విజన్-2047 సెంటర్ ప్రారంభం

» ప్రజలకు సకాలంలో సేవలు.. హోం మంత్రి అనిత



విజన్-2047 సెంటర్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజన్-2047 సెంటర్‌ను సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. నియోజకవర్గానికి ఒక విజన్-2047 కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. పాయకరావుపేటకు సంబంధించి నక్కపల్లిలో ఏర్పాటు చేశారు. సోమవారం ప్రారంభించిన ఈ కేంద్రానికి స్థానిక ఎమ్మెల్యే అయిన హోం మంత్రి అనిత చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ప్రజల స్థితిగతులు, సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, ఇతర కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కేంద్రంలో ఐదుగురు ప్రత్యేక సిబ్బంది వుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ నక్కపల్లి, పాయకరావుపేట మండలాల అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, చించలపు పద్దు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, కొరుప్రోలు సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి గుర్రం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి

10.20 గంటల సమయంలో ఎలమంచిలి మునిసిపాలిటీ కొక్కిరాపల్లి పరిధి ప్రేమసమాజం వద్దకు వచ్చేసరికి.. అక్కడ కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి ఎలమంచిలి వెళుతున్న సర్వీసు ఆటో ప్రయాణికులు దిగడానికి ఆగింది. టాటా మ్యాజిక్ డ్రైవర్ ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేసే క్రమంలో అక్కడ ఆగి వున్న ఆటో దగ్గరకు వచ్చే వరకు కనిపించలేదు. దీంతో వేగంగా వచ్చి, ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆటో రోడ్డు పక్కన వున్న సిమెంట్ పిరమిడ్‌లను ఢీకొని బోల్తా పడింది. సమాచారం అందుకున్న సీఐ ధనుంజయరావు, ఎస్ఐ ఉపేంద్ర, పోలీసులు అక్కడకు చేరుకుని, హైవేపై వెళుతున్న వాహనదారులతోపాటు స్థానికుల సహకారంతో ప్రమాదానికి గురైన వాహనాల్లో చిక్కుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. ఆటోలో ప్రయాణిస్తున్న కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గొంది పెంటయ్య (56), నర్సీపట్నం మునిసిపాలిటీ దనిమిరెడ్డి వీధికి చెందిన బాదంపూడి లక్ష్మి(65), చింతకాయల రమణమ్మ (మల్లవరం), పక్కుర్తి అప్పలరాజు (సంతపాలెం), గొంది లక్ష్మి(తీడ), టాటా మ్యాజిక్‌లో ప్రయాణిస్తున్న బండి జాస్మిన్, బండి కరుణ, బండి ఆనంద విజయ, బండి అబ్బాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో వున్న డ్రైవర్ జామి సూర్యనారాయణ (సింగవరం), కె.హేమలత(పెదపూడి), చింతకాయల యశ్వంత్ (మల్లవరం), వై.అమ్మాజీ(రామన్నపాలెం), వెంకటలక్ష్మి (రామన్నపాలెం), శ్రీహరిపురానికి చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్ కె.నానిబాబు, బండి నరసింగరావు అలియాస్ సాలేమ్‌రాజు, నడిగట్ల విజయ, ఎస్.రాజ్‌కుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఇదే సమయంలో మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి వైపు నుంచి నక్కపల్లి వెళుతున్నారు. ఆమె వెంటనే కాన్వాయ్‌ను ఆపించి, క్షతగాత్రులను త్వరగా ఆస్పత్రులకు తరలించేలా చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, మిగిలిన, వారిని ఎలమంచిలి సీహెచ్‌సీకి పంపారు. అప్పటికే సమాచారం అందుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఎలమంచిలి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. కాగా అనకాపల్లి పంపిన క్షతగాత్రుల్లో గొంది పెంటయ్య, బాదంపూడి లక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందారు. మిగిలిన వారికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం తరలించారు. ఎలమంచిలి ఆస్పత్రికి తరలించిన క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపారు. అప్పటి వరకు మంత్రి అనిత, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆస్పత్రిలోనే వుండి పర్యవేక్షించారు. ఈ ప్రమాదంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతుల కోసం పైసా వసూల్

... 5వ పేజీ తరువాయి

ముగిసిన అనంతరం పదోన్నతుల జాబితాలో పేరు కలిగిన వారి వద్ద నుంచి బ్యాంకులో కీలక వ్యక్తి సన్నిహితుడు ఒకరు వసూళ్లకు తెరతీశారు. పోస్టును బట్టి మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ తీసుకున్నట్టు చెబుతున్నారు. నగరంలో ప్రముఖ మోటారు వాహనాల కంపెనీలో పనిచేసే వ్యక్తి డీసీసీబీలో కీలక వ్యక్తి ఛాంబర్‌కు వస్తున్నాడు. మార్కెట్ వ్యవహారాలలో అనుభవం ఉన్న ఆయన స్వయంగా ఫోన్ చేసి ఫలానా చోటుకు సొమ్ములు తీసుకురావాలని కోరినట్టు చెబుతున్నారు. కీలక వ్యక్తి సూచన మేరకు సుమారు కోటి రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ సొమ్ములు ఇవ్వాల్సిందేనని దబాయించారని కొందరు ఉద్యోగులు అంటున్నారు. సొమ్ముల వ్యవహారంపై కొందరు సిబ్బంది ఆప్కాబ్‌కు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. కాగా ఈ ఆరోపణలను బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ వద్ద ప్రస్తావించగా ఆప్కాబ్ నిబంధనలు, మార్గదర్శకాల మేరకూ పదోన్నతులు కల్పించామన్నారు. మెరిట్, రోస్టర్ మేరకు ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థుల జాబితా తయారుచేశామన్నారు. పదోన్నతులు పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు.

కల్యాణం కమనీయం

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చారు. పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై టీటీడీ అర్చకులు కృష్ణశాస్త్రి 6.55 గంటలకు స్వామి వారి కల్యాణ వేడుకలకు శ్రీకారంచుట్టారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుపతి నుంచి వచ్చిన అర్చకుల బృందం, వేద పండితులు మంత్రోచ్చరణలతో స్వామి వారి కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తిరుమలలో శ్రీనివాసుని కల్యాణాన్ని స్వయంగా తిలకించిన అనుభూతి పొందారు. అన్నమయ్య కీర్తనలు, స్వామి భక్తి గీతాల ఆలాపనతో స్టేడియంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ దంపతులు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు, దాడి రత్నాకర్, చింతకాయల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

పంట కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

» కార్మికులెవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం



పంట కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

ఎస్.రాయవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం సెజ్‌లోని బ్రాండిక్స్ కంపెనీకి ఉద్యోగులను తీసుకురావడానికి వెళుతున్న బస్సు మండల కేంద్రానికి సమీపంలో పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ సమయంలో బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పలుగ్రామాలకు చెందిన కార్మికులు సెజ్‌లోని బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం షిఫ్ట్‌కు హాజరయ్యే కార్మికులకు తీసుకెళ్లడానికి తెల్లవారుజామున ఎస్.రాయవరం నుంచి బస్సు ధర్మవరం అగ్రహారం వైపు బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లిన తరువాత రోడ్డు మలుపుగా వున్నచోట బస్సు అదుపు తప్పి పక్కనే వున్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో బస్సులో కార్మికులెవరూ లేరు డ్రైవర్ కూడా క్షేమంగా బయటపడ్డాడు. బస్సులో కార్మికులు వుంటే పరిస్థితి మరోలా వుండేదని స్థానికులు ఆందోళన చెందారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మాకవరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బుచ్చన్నపాలెం గ్రామానికి చెందిన సామోజు సాంబ(60) ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో బైక్‌పై బూరుగుపాలెం వెళుతున్నాడు. ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుడంగా దారిలో మృతిచెందాడు. కాగా మండలంలోని పైడిపాల గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడు(50) గత నెల 27వ తేదీన కొండలఅగ్రహారం నల్లమారెమ్మ గుడి వద్ద ప్రమానికి గురైయ్యాడు. తలకు తీవ్రగాయం కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈ సంఘటనలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎఫ్‌సీఐ గోదాము వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్టు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. బీఆర్టీ కాలనీకి చెందిన జగన్నాథం ప్రకాశ్ ఆదివారం తెల్లవారుజామున రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా కూండ్రం వైపు వెళుతున్న వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్‌ను కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఆయన కుమారుడు వరకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్ స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి